## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 26 (ప్రభాతవార్త):**
గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఓపి సేవలు ఏవిధంగా జరుగుతున్నాయి, సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. విషజ్వరాలు ప్రబలుతున్న కారణంగా ప్రజలు జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులకు చూపించుకొని వారి సూచనలు పాటించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ బల్బీర్‌సింగ్, సిహెచ్‌ఓ కాసిం, ఎంపిహెచ్‌ఓ సురేందర్, శ్రీలత, ఫార్మసి ఆఫీసర్ మమత, సిబ్బంది ఉన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## సరదా కోసం ప్రాజెక్టుల వద్దకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దు

**-గజ్వేల్ ఎసిపి నరసింహులు**

**ములుగు, సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):** దసరా పండుగ సెలవులు ఉన్నందున పిల్లలు, పెద్దలు ఎవరూ సరదా కోసం ప్రాజెక్టుల వద్దకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దని గజ్వేల్ ఎసిపి నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండపోచమ్మ సాగర్‌ను స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిపి నరసింహులు మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్‌తో పాటు అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు వర్షం నీటితో నిండుకున్నాయని తెలిపారు. చేపలు పట్టేందుకు కానీ, ఈత కొట్టేందుకు కానీ, సరదా కోసం కానీ ఏది ఏమైనా సరే ప్రాజెక్టుల వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. పండుగ సెలవుల వల్ల తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా లేదా స్నేహితులతో ఎక్కడికీ వెళ్లనివ్వకుండా ఇంట్లోనే ఆనందంగా గపడాలని సూచించారు. కొండపోచమ్మ సాగర్‌లో ఇటీవల జరిగిన సంఘటనల కారణంగా సాగర్‌పైకి పూర్తిగా నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రాజెక్టువద్దకు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రీసెండింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం**

## స్థానిక ఎన్నికలు జరిగేలా చూడాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ జరిగేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాల ప్రీసెండింగ్ అధికారుల శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రీసెండింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. కరదీపికను క్లుప్తంగా చదివి అర్థం చేసుకోవాలని ప్రీసెండింగ్ అధికారులకు సూచించారు. ఎలాంటి అనుమానం వచ్చిన మాస్టర్ ట్రైనర్‌లకు తెలుపాలన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వహించిన వారు కొత్తగా విధులు నిర్వహిస్తున్న వారు సైతం ఎన్నికల ప్రక్రియ శిక్షణ తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకీదేవి, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు తెలంగాణ

**సబ్ కలెక్టర్ ఉమా హారతి**



బతుకమ్మ సంబురాలలో సబ్ కలెక్టర్ ఉమాహారతి

**నారాయణఖేడ్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాల పుట్టినిల్లని సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా జరిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ అంగన్‌వాడీ ఆఫీసర్స్, మహిళలు బతుకమ్మ పాటతో పాటు, కోలాటం వేసి అందరిని ఆనందపరిచారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ ప్రకృతిని ప్రేరేపించే పండగ బతుకమ్మ పండగ అని ఆమె కొనియాడారు. సంబరాల్లో పాల్గొన్న వారు అంగన్వాడీ సీడీపీఓ సుజాత, పర్యవేక్షకులు జమున, ప్రేమల, అనురాధ, ప్రశాంతి పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వర్షాలతో పొంగుతున్న చెరువులు, వాగులు

**సంగారెడ్డి మున్సిపాలి సెప్టెంబర్ 26, ప్రభాతవార్త :** కురుస్తున్న వర్షాలతో జిల్లాలో ప్రజల అష్టకష్టాలు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురుస్తున్న వర్షంతో జిల్లాలోని మండలాల పరిధిలోగల చెరువులు కుంటలు నీటితో నిండుకుండలామారాయి. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండి ఉన్నాయి. ప్రజలు బయటికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలలోని పంటలు నీటమునిగాయి. ఇళ్లలోకి నీరుచేరాయి. ఇప్పటికే జిల్లా యంత్రాంగం భారీ వర్షాలు ఉన్నాయని సూచనతో జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేశారు. సంబంధిత జిల్లా అధికార యంత్రాంగానికి అప్రమత్తం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించారు.

## పదేళ్ల తర్వాత తెరుచుకున్న సింగూరు పది గేట్లు

**-ఇన్‌ఫ్లో 89305-ఔట్ ఫ్లో 89165 క్యూసెక్కులు**

పుల్‌కల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:
సింగూరు ప్రాజెక్టుకు ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద ప్రవాహం సింగూరు ప్రాజెక్టులోకి దూసుకువస్తుండటంతో సింగూరు ప్రాజెక్టు జలకళలో సంతరించుకుంది. ప్రాజెక్టులోకి వరద నీరు ఉధృతంగా చేరుకుంటుండంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ దిగువకు వరద నీటిని పంపుతున్నారు. ప్రాజెక్టులోని వస్తున్న వరద ఉధృతిని అనుసరించి ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి 10 క్రస్ట్ గేట్ల ద్వార వరద జలాలను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు 17 గేట్లు ఉండగా 10 గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. గడిచిన 10 ఏండ్ల తర్వాత 9 గేట్ల ద్వార నీటిని పండపం విశేషంగా చెప్పుకోవచ్చు. 4,5,9,12,14,15,16 గేట్లను రెండు మీటర్లు, 3,8,10 క్రస్ట్ గేట్లను మీటరున్నర ఎత్తి నీటిని మంజీర జలాశయానికి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 89305 క్యూసెక్కులుగా నమోదయింది. 10 క్రస్ట్ గేట్ల ద్వార 87221 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేటు గుండా 1284 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యుఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు నమోదయింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులో 520.847 మీటర్లకు 17.710 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు ప్రాజెక్టు రికార్డులు దృవీకరిస్తున్నాయి.



సింగూరు ప్రాజెక్టు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు.. పొంగుతున్న కల్వర్టులు, వాగులు.. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**పాపన్నపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
రానున్న నాలుగు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం పాపన్నపేట మండలం గణపురం ఆనకట్ట ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 04 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు జిల్లాకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గౌరవ ముఖ్యమంత్రివర్యులు సూచన మేరకు ఆరెంజ్ ఎల్లార్ట్ లో ఉన్న 21 జిల్లాల కలెక్టర్లుకు రెవెన్యూ మినిస్టర్ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గారు, చీఫ్ సెక్రటరీ గారు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలందరినీ అప్రమత్తం చేయాలని ఆదేశించారని తెలిపారు. మన పక్క జిల్లాలో కూడా భారీ నుండి అతి భారీ వర్షాలు పడుతున్న నేపధ్యంలో దూర ప్రాంత పర్యటనలు వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల ప్రభావం, నీటి ప్రవాహాల స్థితిపై సమాచారం సేకరించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంతెనలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా ప్రజలందరికీ నిరంతరం జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పొంగి పొర్లుతున్న వాగులు దాటకుండా పటిష్ట బందోబస్తు, బారికేడ్లు ఏర్పాటు చేసేలా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు చెప్పారు చెరువులు, వాగులు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని హితవు పలికారు. అనంతరం మండల పరిధిలోని నాగ్సన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను కలెక్టర్ పరిశీలించారు. మంజూరైన ఇండ్లు ఏ ఏదశలలో ఉన్నాయో సంబంధిత ఏఈని అడిగి తెలుసుకున్నారు. జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు మంజూరు అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది, ఉన్నారు



గణపురం ఆనకట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

# స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపునకు కృషిచేయాలి

**కార్యకర్తలకు మెదక్ ఎంపి రఘునందన్ రావు సూచన**

**నర్సాపూర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :**
రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారం చేపడుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ రాధా మల్లేష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో దేశం అభివృద్ధి చెందిందన్నారు. జిల్లాలో బిజెపి పటిష్టంగా ఉందని పేర్కొంటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులకు పోటీలో నిలబడాలన్నారు. ఈ మేరకు బిజెపి కార్యకర్తలు అంతా సైనికుల్లా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి సూచించారు. నర్సాపూర్ మెదక్ వరకు నాలుగు లైన్ల జాతీయరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాళ్దాస్ రాధామల్లేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘ సాని సురేష్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు ఎర్రగొళ్ల లతా రమేష్ యాదవ్, యాదగిరి, సీనియర్ నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, జిల్లా మహిళా నాయకురాలు కవితారెడ్డి, నర్సాపూర్ మండల అధ్యక్షుడు నీలి నాగేష్, పట్టణ అధ్యక్షుడు నీరుడి చంద్రయ్య, నాయకులు బాలరాజు, బోర్వెల్ రామ్‌రెడ్డి, సంఘ సాని రాజు, రాష్ట్ర నాయకులు జిల్లా పదాధికారులు మండలాధ్యక్షులు వివిధ మోర్చాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు భూత్ అధ్యక్షులు బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నర్సాపూర్ లో బిజెపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

## భారీ వర్షాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలి సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు సురక్షితంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి ఆర్డీవోలు, తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా లో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండిన వివరాలను కలెక్టర్ అధి కారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్ర మత్తం చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు ఎక్కడ ఏ సమస్య తలెత్తిన తక్ష ణం అధికారులు సహాయక చర్యలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. తక్షణ సహాయం కోసం ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 08455276155కు సంప్ర దించాలని, సూచించారు.
కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఆర్డీవోలు పాండు, రాజేందర్, దేవుజా, డిపిఓ శివ ప్రసాద్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు, తహసీల్దార్లు, మున్సి పల్ కమిషనర్లు, డివిజనల్ సూపరింటెండెంట్, ఆర్‌బి ఇఈలు, పంచాయతీరాజ్ ఇఈలు, ఎస్ఈ ఎస్పీ డిసిఎల్, ఎస్ఈ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# యశ్వంత్‌రెడ్డిదే టేక్మాల్ సొసైటీ చైర్మన్ పీఠం

**హైకోర్టు స్టేతో నిలిచిన పదవి... వరసు ఓటమిలను చవిచూస్తున్న అధికార పార్టీ నాయకులు**

**టేక్మాల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘంలో రాజుకున్న రాజకీయం రసవత్తరంగా మారింది. ప్రాథమిక సహకార సంఘంలో ఉంటున్న చైర్మన్‌ను తొలగించాలన్న ఉద్దేశంతో అధికార పార్టీకి చెందిన కొందరు డైరెక్టర్ల ప్రోత్బలంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి విఫలమై దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. ప్రజాస్వామ్యంలో ఓటమిని చవిచూసిన కేవలం అధికారం ఉందనే ఒకే ఒక్క కారణంతో తాము అనుకున్న వారికి పదవిని కట్టబెట్టడానికి కాంగ్రెస్ చేసిన విశ్వప్రయత్నం బెడిసి కొట్టింది. టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా గతంలో యశ్వంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవిని చేజింకించుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. అవినీతి ఆరోపణలు, ఆవిశ్వాసం ఇలా ఎన్ని ప్రయత్నాలు కాంగ్రెస్ చేసినా అన్నింటిని తట్టుకుని చెర్మన్ యశ్వంత్‌రెడ్డి ముందు నిలిచారు. కాగా సొసైటీ పాలక వర్గాల పదవి కాలం పొడిగిస్తూ రెండుసార్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల జిల్లాలో 31 సొసైటీలకు పదవీకాలం పొడిగించారు. మరో నాలుగు సొసైటీలను అనర్హత కారణంగా అలాగే ఉంచారు. అయితే టేక్మాల్ సొసైటీ చైర్మన్‌ను మారుస్తూ ఇన్‌చార్జ్ సొసైటీ అధికారి ఉత్తర్వులను జారీ చేశారు. అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అధిపత్యాన్ని చూపించుకోవడానికి సొసైటీ అధికారితో ఉత్తర్వులు జారీచేయించుకుని చైర్మన్‌గా నర్సింహారెడ్డిని ప్రకటించుకున్నారు. అవినీతి ఆరోపణలు రుజువు కాకముందే విచారణ కొనసాగుతున్న సమయంలో వేరేవారికి చైర్మన్ పదవి కట్టబెట్టారని హైకోర్టును చైర్మన్ యశ్వంత్‌రెడ్డి ఆశ్రయించారు. డీసీవో ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు చెప్పారు. దీంతో పాత పాలకవర్గం పదవుల్లో ఉన్న పాలకవర్గమే కొనసాగుతుందని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి తాను సొసైటీ చైర్మన్‌గా కొనసాగుతానని ఆయన తెలిపారు. డిసిఓ కరుణకర్ చేతుల మీదుగా హైకోర్టు ఉత్తర్వులను యశ్వంత్‌రెడ్డి అందుకున్నారు. దీంతో కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు బెడిసికొట్టాయి. పచ్చని సంసారంలో నిప్పు పోసినట్టు అభివృద్ధి బాటలో కొనసాగుతున్న సహకార సంఘంలో పెత్తనం సాగాలన్న పంతంతో అవిశ్వాస తీర్మానం మొదలుకొని, దాడులు జరుపుకొని దానికి రాజకీయ రంగుపూసి నాటకీయ పరిణామాల మధ్య సొసైటీ సీఈఓ సస్పెన్షన్‌తో పంతం పోయిందని అనుకుంటే అదికాస్త హైకోర్టు స్టేతో బెడిసికొట్టిందని, దీనంతటికీ కారణం కొందరు నాయకులేనని పార్టీ పరువు తీయడానికే ఇలా చేస్తున్నారని అధికార పార్టీ నాయకులు మండిపడుతున్నారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి రాజకీయాలను పక్కనపెట్టి సొసైటీ అభివృద్ధికి ఆటంకాలను తొలగించి ప్రగతి పథాన కొనసాగే విధంగా సాగాలని మండల సంఘ సభ్యులు, రైతులు కోరుతున్నారు.



టేక్మాల్ ప్రాథమిక సంఘం కార్యాలయం (సర్కిల్‌లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు)



జలమయంగా మారిన పటాన్‌చెరు రహదారి

## పటాన్‌చెరులో భారీ వర్షం

**జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు**

**పటాన్‌చెరు, 26, సెప్టెంబరు 25, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో వాగులు, కాలువలు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో నక్కవాగు పొంగి ప్రవహిస్తోంది. ఓఆర్‌ఆర్ ముత్తంగి ఎగ్జిట్ నుంచి ఇంద్రేశం వైపు వెళ్లే సర్వీస్ రోడ్డుపై నక్కవాగు ఉండడంతో నక్క వాగు బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలను నిలిపివేశారు. పోలీసులు ముత్తంగి ఎగ్జిట్ వద్ద 65వ జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డును మూసివేసి వాహనాలను పటాన్‌చెరు వైపు మళ్లించారు. 65వ జాతీయ రహదారి నుంచి పోచారం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో వాహనాలను మళ్లించారు. ముత్తంగి నుంచి పోచారం, ఇంద్రేశం వైపు వెళ్లే సర్వీస్ రోడ్డును మూసివేసి పోలీసులు వాహనాలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు ఉదయం నుంచి రోడ్డుపైనే ఉండి భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. వరద నీటితో నక్క వాగు ప్రవహించడంతో అటువైపు ఎవరు వెళ్లకుండా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. వరద నీటి కాలువలు కబ్జాలకు గురి కావడంతో వరద నీరు రోడ్లపై ప్రవహించి కాలనీలు జలమయమవుతున్నాయి. వర్షపు నీరు జాతీయ రహదారిపైకి రావడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కాకుండా పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలు నాయక్ లు పోలీసు సిబ్బందితో ట్రాఫిక్ అంతరాయం కాకుండా సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

## కుకునూరుపల్లి పిహెచ్‌ని సందర్శించిన అదనపు కలెక్టర్

**డెంగ్యూ వ్యాధితో మృతి చెందినా సమాచారం ఇవ్వలేదంటు డాక్టర్ పర్వీన్‌పై ఆగ్రహం**



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**కొండపాక, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** డెంగ్యూ వ్యాధితో బాలుడు యశ్వంత్ మృతి చెందిన విషయం జిల్లా స్థాయి అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదంటూ జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ కుకునూరుపల్లి పిహెచ్‌సి వైద్యధికారి పర్వీన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె ఆకస్మికంగా కుకునూరుపల్లి పిహెచ్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పార్మసీ, ల్యాబ్, వ్యాక్సిన్‌ను భద్రపరిచే ఫ్రిజ్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె కుకునూరుపల్లి పిహెచ్‌సి పరిధిలోని కొడకండ్ల గ్రామానికి చెందిన బాలుడు యశ్వంత్ (11) వారం రోజుల క్రితం డెంగ్యూ వ్యాధితో మృతి చెందాడు. ఈ విషయాన్ని డాక్టర్ పర్వీన్ జిల్ల స్థాయి అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదంటూ ఆమెపై మండిపడ్డారు. పిహెచ్‌సికి వస్తున్నవారికి అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఒపి సేవలకు ఎంత మంది పేషంట్లు వస్తున్నారని అడిగి, ఒపి పేషంట్లను ఎందుకు చూడడంలేదంటు డాక్టర్‌ను ప్రశ్నించారు. డెంగ్యూ వ్యాధి వివరాలను వెంటనే అందజేయాలని డిఎం అండ్ హెచ్‌ఓ దన్‌రాజును ఫోన్‌లో ఆమె అదేశించారు. ఆమె ఆదేశాలతో వెంటనే అయన, డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి కుకునూరుపల్లి పిహెచ్‌సిని సందర్శించి డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన బాలుడి వివరాల గురించి డాక్టర్ పర్వీన్‌తో చాలాసేపు మాట్లాడారు. అనంతరం సిబ్బందిని డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయానికి పిలిపించుకొని మాట్లాడారు.

## తల్లిదండ్రులు పిల్లల రక్షణపై దృష్టి పెట్టాలి : ఎస్ఐ

**వర్గల్, సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):**
దసరా సెలవుల్లో అనేక మంది విద్యా ర్థులు చెరువులు, వాగులు వద్ద జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లల రక్షణపై దృష్టి పెట్టాలని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలు నీటితో నిండుకొని ఉన్నాయని, బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మలను నిమజ్జనంచేసే సమయంలో జాగ్రత్తలు వహించాల న్నారు. అలాగే ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. పిల్లలు మొబైల్ ఫోన్ వాడేటప్పుడు ప్రమాదకర గేమ్స్ ఆడనివ్వకుండా చూసుకోవాలన్నారు.

## రాజనెల్లిలో పేకాటరాయుళ్ల అరెస్టు

**జహీరాబాద్(కోహీర్), సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కోహీర్ మండలం రాజనెల్లి గ్రామ శివారులోని పల్లె ప్రగతి వనం పక్కన పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న కోహీర్ ఎస్ఐ నరేష్ సిబ్బందితో దాడిచేసి అదుపులోకి తీసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం... ఆరుగురు పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో జూదగృహంపై దాడిచేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. జూదరుల నుంచి రూ. 2420, పేకముక్కలను, సెల్‌ఫోన్‌లను స్వాధీ నం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## చెరువులో పడి యువకుడి మృతి

**సంగారెడ్డి, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** యువకుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన కంది మండల పరిధిలోని కవలంపేటలో జరిగింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మహమ్మద్ ఫిరోజ్(30) ఈ నెల 23న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడన్నారు. బోధన్ చెరువులో తేలిన మృతదేహాన్ని గమనించిన గొర్రెలకాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చెరువులో నుంచి మృతదేహాన్ని తీసి పరిశీలించగా ఫిరోజ్‌గా గుర్తించామ న్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ వివరించారు.

## శ్రీమహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

**–భక్తులతో సందడిగా మారిన శంభుగిరి కొండలు**



ఆలయంలో బారులుతీరిన భక్తులు

**వర్గల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వర్గల్‌లోని శ్రీవిద్యాసరస్వతి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీవిద్యాసరస్వతీదేవి శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. వివిధప్రాంతాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో శంభుగిరి కొండలు సందడిగా మారాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు, అర్చకులు అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు, చండీ హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి...**
శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా వర్గల్ క్షేత్రంలో శ్రీవిద్యాసరస్వతి అమ్మవారిని శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్యలు దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా వారిని వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

## అసమానతలు రూపుమాపేందుకే అంబేద్కర్ కృషి

**–కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు**



అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న స్కైలాబ్‌బాబు

**జోగిపేట, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:**
అసమానతల దుష్టత్వాన్ని భారత రాజ్యాంగం ద్వారా దూరం చేసిన మహానుభావుడు బాబాసాహెబ్ అంబేద్కర్ అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని నాదులాపూర్‌లో ఏర్పాటుచేసిన అంబేద్కర్‌విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మనుస్మృతి కాలంనాటి అసమానతలను చవిచూసిన అంబేద్కర్ సమాజంలో అందరూ సమానంగా ఉండాలనే ఉద్దేశంతో భారత రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. దేశంలో అందరూ సమానమే, చట్టం దృష్టిలో అందరూ ఒక్కటేనన్న భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతుందని విమర్శించారు. యువతరం కులమతాలకు అతీతంగా ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్యం, జిల్లా కార్యదర్శి అశోక్, మాజీ కార్యదర్శి విద్యాసాగర్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీన్, గ్రామ మాజీసర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, సత్యనారాయణ, గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జుంజురు రవి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకోవాలి

**–పోషకుల సమావేశం ప్రిన్సిపాల్ రవీందర్**

**రామచంద్రాపురం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
బిహెచ్‌ఈఎల్‌లోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శుక్రవారం పోషకుల–అధ్యాపకుల సమావేశాన్ని ఇంటర్మీడియట్ కమీషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థిదశలో అత్యంతకీలకమని గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటర్‌మీడియట్‌లో సిసి కెమెరాలు, ఫైర్ సేఫ్టీ, ఉచితవిద్య, టెలిమానస్, విద్యార్థికౌన్సిలర్స్, హెల్ప్ కార్యక్రమాల ఏర్పాటు ప్రైవేటుకు ధీటుగా విద్యాబోధన సాగేలా చేస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఇష్టంగా చదువుకుంటే భవిష్యత్తు బంగారుమయం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో గీతామాధురి ఆలపించిన పాట సభికులకు ఆకట్టుకుంది. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిలను మోసంచేస్తున్న రాష్ట్రప్రభుత్వం

**హత్నూర, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మోసం చేస్తుందని, హత్నూర మండలం బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పండుగ రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం హత్నూరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివోతో స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాదనే విషయం తెలిసినా, అదే జివోతో ఎన్నికలు నిర్వహిస్తామంటూ ప్రజలను మభ్యపెడుతోందని ఆయన ఆరోపించారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం



విరిగి కొస అంచుతో ప్రమాదకరంగా ఉన్న కరెంట్ స్తంభం

**చేర్యాల, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండలంలోని ముస్త్యాల ఎస్సీ కాలనీలో అల్లిబిల్లి కిషన్ ఇంటి వద్ద ఉన్న విద్యుత్‌స్తంభం విరిగి కొస అంచుతో ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికి కూడా ఆస్తంభంనుండి నివాసాలకు విద్యుత్‌సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఈస్తంభం నిలువుటద్దమని పలువురు అంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈదారి వెంబడి ఎవరైనా అటుగా వెళ్ళాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడక సాగిస్తున్నామని, ఇప్పటికైనా జిల్లా అధికారులుస్పందించి విద్యుత్‌స్తంభానికి మరమ్మతులు చేయించే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.
జంతు మార్పిడి విధానంలో వసంత్‌రాయ్ జూపార్కు నుంచి

## నెహ్రూ జులాజికల్ పార్కుకు చేరుకున్న మూడు జీబ్రాలు

**చార్మినార్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
జంతుమార్పిడి విధానంలోభాగంగా హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుకు శుక్రవారం గుజరాత్‌లోని వసంతరాయ్ జూపార్కు నుంచి మూడు జీబ్రాలు వచ్చాయి. ఈజీబ్రాలలో రెండు మగ, ఒకటి ఆడ జీబ్రాలు ఉన్నాయి. ఈజీబ్రాలను జూపార్కు జంతువుల వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. వారంరోజుల తర్వాత ఎన్‌క్లోజర్‌లలో జిబ్రాలను పెట్టనున్నారు. కాగా జంతు మార్పిడి విధానంలో భాగంగా నెహ్రూ జూలాజికల్ పార్కునుంచి పది మూషిక జంటలను గుజరాత్‌లోని వసంత్‌రాయ్ జూపార్కుకు అందజేయనున్నారు.

# చాకలి ఐలమ్మకు ఘన నివాళులు



మామిడ్యాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం



మర్కుక్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం



ప్రజ్ఞాపూర్‌లో నివాళులర్పిస్తున్న నేతలు



శ్రీగిరిపల్లిలో నివాళులర్పిస్తున్న దృశ్యం



నివాళులర్పిస్తున్న దృశ్యం

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లో రజకసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్ రజకసంఘం అధ్యక్షుడు టెంట్ నర్సింలు, సంఘంనాయకులు ఐలమ్మవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రజకసంఘం రాష్ట్ర నాయకులు ఎల్లేష్, శ్రీధర్, ప్రశాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎన్‌సి.రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, బొగ్గుల చందు, రజకసంఘం నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**శ్రీగిరిపల్లిలో...**

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతిసందర్భంగా ఆమెవిగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ చంద్ర మోహన్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, శ్రీధర్‌లు తిరుపతి, జూపల్లి వెంకట్, సతీష్, వెంకటయ్య, లక్ష్మణ్, తాదూరి గోవర్ధన్, ఉప్పలయ్య, రామయ్య, బాల్‌నర్సయ్య, రాజయ్య, చందు, మల్లయ్య, చంద్రవ్వ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

**మామిడ్యాలలో...**

**ములుగు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
ములుగు మండలం మామిడ్యాల గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతిని రజకసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల ప్రధానకార్యదర్శి రాచకొండ శ్రీకాంత్, గ్రామ ఉపాధ్యక్షుడు మల్కంటి మధు, సభ్యులు బయ్యారం నవీన్, రాచకొండ శ్రీధర్, రాచకొండ రజినికాంత్, రాచకొండ నగేష్, బయ్యారం బాలకృష్ణ, అనిల్, కృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

**మర్కుక్‌లో...**

**మర్కుక్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండలకేంద్రం మర్కుక్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు పాపోల్ల రాజు, అధ్యక్షుడు కర్రోళ్ల కరుణాకర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బబ్బూరి మల్లేశంగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, తుప్పతి బిక్షపతి, మాధవరెడ్డి, బబ్బూరి శ్రీనివాస్‌గౌడ్, కనకయ్య, కర్రోళ్ల నవీన్, తులసి భాస్కర్, ఎర్రోళ్ల మల్లేశం, బాలరాజు, బాబు, శేఖర్, సంపత్, చింటు, మహేష్ పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
చాకలి ఐలమమ్మ జయంతి వేడుకలను మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని ఐబి చౌరస్తాలో రజకసంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు జగన్, ఆంజనేయులు, బేతయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ పథకంతో పేదింటికల సాకారం

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
పేదవారికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పాపన్నపేట మండలం నాగ్సన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి పనులను కలెక్టర్ పరిశీలించారు. మంజూరైన ఇళ్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న పురోగతిని సంబంధిత హౌసింగ్ ఎఈని అడిగి తెలుసుకున్నారు. జాప్యంలేకుండా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరయ్యే విధంగా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల చెల్లింపులో జాప్యంలేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**యాత్రదానం ద్వారా సామాజిక సేవలో పాల్గొనాలి: కలెక్టర్ రాహుల్‌రాజ్**
తెలంగాణరాష్ట్ర రోడ్డురవాణాసంస్థ ప్రారంభించిన వినూత్నపథకం యాత్రదానం ద్వారా సామాజిక సేవలో పాల్గొనాలని స్వచ్ఛంద సంస్థలకు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆర్టీసి డిఎం సురేఖ, ఆర్టీసి ఉద్యోగులతో కలిసి యాత్రదానం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్ర రోడ్డురవాణాసంస్థ బస్సు యాత్రదానం చేయడానికి వినూత్నపథకం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వివిధ సంఘాలు, స్వచ్ఛందసంస్థలు, వ్యక్తులు, కుటుంబాలు, ఎన్ఆర్‌వోలు, వెబ్ జిఓలు, యూత్ ఆర్గనైజేషన్స్, గ్రామపెద్దలు, పూర్వవిద్యార్థులు స్పాన్సర్‌షిప్ చేసి అనాథలకు వృద్ధాశ్రమాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, పేద విద్యార్థులకు, పేదవారికి అన్నదానం, వస్త్రదానం, విద్యాదానం చేస్తూ, తమ ఉదారతను చాటుతున్న ప్రతి ఒక్కరికి తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ మాబస్సు ద్వారా యాత్రదానం చేయటానికి ఆర్‌టిసి సంస్థ వారు ఒక వినూత్న పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ఆర్టీసీ డిఎం సురేఖ మాట్లాడుతూ పుట్టినరోజులు, పెళ్ళి రోజులు, ఇతర శుభకార్యాలు, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఆర్‌టిసి సంస్థ యాత్రదానం పథకం ద్వారా సహాయసహకారాలు అందించడం ద్వారా ఎంతోమంది పేదవారికి పుణ్యక్షేత్రాలు పర్యాటక ప్రాంతాలు, విహార, విజ్ఞానయాత్రలు, ఇతర దర్శనీయ స్థలాలు చూపించే మంచి అవకాశం కల్పించడం జరుగుతుందని చెప్పారు. యాత్రదానం చేయవలసినవారు మెదక్ డిపో నర్సాపూర్ డిపో 9959226268, 7780775815, 8142252282, 9491634420, 9701724155 నంబర్లను సంప్రతించవచ్చు అని వివరించారు.

## ధీరవనిత చాకలి ఐలమ్మ

**–అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**



ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని సంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్లో చాకలి ఐలమ్మ జయంతివేడుకలు బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా ముందుగా కలెక్టరేట్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యతో కలిసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి సంస్మరణసభను నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పోరాటంచేసిన ధీరవనితగా ఐలమ్మను కొనియాడారు. ఈకార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి జగదీష్, బిసి సంఘాలు, రజక సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎన్నికల సక్రమ నిర్వహణకు అందరు సహకరించాలి

**–జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**



ఎన్నికలశిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అగర్వాల్

**కొండపాక, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
ఎన్నికలు సజావుగా జరగడానికి అందరు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్(లోకల్‌బాడీ) గరిమా అగర్వాల్ కోరారు. శుక్రవారం కొండపాక మండల కేంద్రంలోని రైతువేదికలో కొండపాక, కుకునూరుపల్లి, కొమురవెల్లి మండలాలకు చెందిన ఎన్నికల నిర్వహణ అధికారులు పిఒ, ఎపిఒలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ ఓటింగ్ సక్రమంగా జరగడానికి పిఒలు, ఎపిఒలు ఎంతో కీలక బాధ్యత వహిస్తారని అన్నారు. ఓటింగ్ రోజు పోలింగ్ బూత్‌లో పిఒలు, ఎపిఒల బాధ్యతలు, విధుల గురించి వివరించారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్స్ కూరెళ్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజమౌళి, ప్రవీణ్‌కుమార్ శిక్షణ కార్యక్రమానికి వచ్చిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఓలు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, ఎంఈఒ శ్రీనివాస్‌రెడ్డి, ట్రైనర్లు అశోక్, మధునాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హత్నూరలో ఎటిసి సెంటర్ ప్రారంభం

**హత్నూర, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన హత్నూరలో ఏర్పాటు చేసిన ఎటిసి సెంటర్ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)ను శనివారం ప్రారంభించనున్నారు. ఐటిఐ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సముదాయంలో ఎటిసి సెంటర్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. దీనిని ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే సంబంధిత అధికారులు అన్నిరకాల తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు.

# మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా

**-పట్టించుకోని అధికారులు**

**బెజ్జంకి, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండలంలోని మోయతుమ్మెద వాగు ఇసుక అక్రమ రవాణాదారులకు కల్పవృక్షంగా మారి కాసుల వర్షం కురిపిస్తుంది. మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులోగల మోయతుమ్మెద వాగు నుంచి అక్రమ రవాణాదారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రి, పగలుతో సంబంధం లేకుండా ట్రాక్టర్ల సహాయంతో అక్రమంగా ఇసుకను తరలించి జన సంచారంలేని ప్రదేశాల్లో పదుల సంఖ్యలో నిల్వచేసి రాత్రి సమయాల్లో బొలేరో, మినీ టిప్పర్లతో పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా ఇసుక తరలిపోతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు మాత్రం వాగువైపు కన్నెత్తిచూసిన పాపాన పోవడంలేదు. అక్రమ ఇసుక రవాణాకు కళ్లెం వేయాల్సిన పోలీసు అధికారులుగాని, రెవెన్యూ అధికారులుగాని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లే ఇసుక డంపులకు నిలయాలు...**
మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లే అడ్డాగాచేసుకొని ఇంటి లబ్దిదారుడికి నయానో భయానో ముట్టజెపుతూ ఇళ్ల నిర్మాణాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుకను నిల్వచేసి రాత్రి సమయాల్లో యథేచ్ఛగా జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. మరికొందరు పట్టపగలే ఇసుక అక్రమరవాణా చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ ఇసుకరవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**–శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నారాయణఖేడ్, కంగ్టి, నిజాంపేట్, నాగల్‌గిద్ద, మనూర్, కల్హేర్ మండలాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మొత్తం 106, సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు మొత్తం 226, చెక్కులమొత్తం రూ.67,43,000లను లబ్దిదారులకు అందజేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క పేదవాడికి ప్రతి ఒక్క పథకం అందేవిధంగా మాప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు మండలాలకు సంబంధించిన కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఉన్నతాధికారులు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గీతంలో ఘనంగా ప్రిన్సిపాల్స్ కొలోక్వియం

**–దేశవ్యాప్తంగా తరలివచ్చిన 150మంది ప్రధానోపాధ్యాయులు**



ప్రిన్సిపాల్స్ కొలోక్వియంలో జ్యోతి ప్రజ్వలనంచేస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
జాతీయ పాఠశాల ప్రిన్సిపాల్స్ శిఖరాగ్ర సదస్సు ప్రిన్సిపాల్స్ కొలోక్వియం2025 పేరిట హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. ప్రైవేటుపాఠశాలల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ (పిఎస్ పిఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండురోజుల గోష్ఠిలో పాల్గొనేందుకుగాను దేశవ్యాప్తంగా సిబిఎస్ఈ, ఐబి, జాతీయ పాఠశాలలకు చెందిన 150మంది ప్రిన్సిపాల్స్ తరలివచ్చారు. ఉన్నతవిద్యను తిరిగి ఊహించుకోవడం నాయకత్వవిధానం, ఆచరణ ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈసదస్సులో బలమైన విద్యాపర్యావరణవ్యవస్థ కోసం పాఠశాలలు, ఉన్నతవిద్య, పరిశ్రమలను అనుసంధానించే కార్యాచరణపై చర్చించనున్నారు. హైదరాబాదులోని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వేగంగామారుతున్న ప్రపంచంలో నీతి, విలువలతో నడిచే నాయకత్వం అనే అంశంపై ప్రసంగించారు. జ్యోతి ప్రజ్వలనతో ఆరంభమైన ఈసంగోష్ఠిలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్ కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ విఆర్ శా తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరు పంచాయతీకి ఎల్‌ఈడి బల్బుల బహూకరణ

**చౌటకూరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామానికి చెందిన పిఆర్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ పార్కుల రాంరెడ్డి 70వేల రూపాయల విలువగల ఎల్‌ఈడి బల్బులను ఎంపిడిఓ శంకర్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్‌కు అందచేశారు. ఎల్‌ఈడి బల్బులు అందచేసిన దాత రాంరెడ్డికి ఎంపిడిఓతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. బతుకమ్మ, దసరా పండగలు వస్తున్నందున త్వరలోనే గ్రామంలో బల్బులను ఏర్పాటు చేస్తామని ఎంపిడిఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుదీప్, మాజీసర్పంచ్ భూంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కారోబార్ జాఫర్, నాయకులు మంగలి చెన్నయ్య, రామాగౌడ్, కైసర్, ఆగమయ్య, గాండ్ల శ్రీనివాస్, కొల్కూరి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో యువకునికి జీవిత ఖైదు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
హత్య కేసులో యువకునికి జీవిత ఖైదును న్యాయస్థానం విధించింది. ఈ మేరకు జిల్లా న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పును ఇచ్చినట్లు చిన్న శంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. చిన్నశంకరంపేట మండలం సంగాయపల్లికి చెందిన చేవ్వా ప్రవీణ్(25) ఇదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు భూతగాదాలు, పాత కక్షలు ఉండగా 28.04.2022న పొలం వద్ద చేవ్వా ప్రవీణ్ లక్ష్మీనారాయణపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ లక్ష్మీనారాయణ 14.మే.2024న మృతి చెందాడు. కొడుకు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు ఎస్సై సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేసుకున్నారు. రామయంపేట సిఐ శ్రీధర్, ప్రస్తుత సిఐ వెంకటరాజాగౌడ్‌లు సమగ్ర విచారణ జరిపి సాక్ష్యాధారాలను న్యాయస్థానానికి అందించారు. బాధితుడి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నీలిమ శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి రూ.5వేల రూపాయల జరిమానాతోపాటు జీవితఖైదును అమలుచేయాలని ఆదేశించారని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

### ప్రజాపాలనపై చిత్తశుద్ధి లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**చిన్నకోడూరు, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజాపాలనపై చిత్తశుద్ధి లేదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, ఎంపిటిసిల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాల్వ ఎల్లయ్య, నాయకులు జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. పారిశుధ్య పనులు నిర్వహించే దిక్కులేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. బతుకమ్మ పండుగ చీరలు ఎమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా బిఆర్ఎస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

### దుర్గామాతకు ప్రత్యేక పూజలు


దుర్గామ్మకు కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

**నంగునూర్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త :** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పాలమాకుల, గట్లమల్యాల, మగ్దూంపూర్, కొండంరాజుపల్లితో పలు గ్రామాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనం ఇవ్వడం జరిగింది. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాలమాకుల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారు దగ్గర ప్రత్యే దీపాలంకరణ సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### కాంగ్రెస్ సేవాదళ్ బ్లాక్ అధ్యక్షుడిగా నిరిగొండ దేవయ్య


నిరిగొండ దేవయ్య నియామకం పత్రాన్ని అందిస్తున్న కృష్ణారెడ్డి

**చిన్నకోడూరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన నిరిగొండ దేవయ్యను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ బ్లాక్ ఏ అధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు హన్మండ్లకాడి కృష్ణారెడ్డి నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరిగొండ దేవయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షునితోపాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంద పాండు, ప్రశాంత్‌రెడ్డి బంక చిరంజీవియాదవ్, బత్తిని గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బాలుర కళాశాలలో పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధర్

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** విద్యార్థులు భవిష్యత్తు నిర్మాణంలో తల్లితండ్రుల పాత్ర కీలకం అని ప్రిన్సిపాల్ సిహెచ్ గంగాధర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లితండ్రులతో పాటు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో అధ్యాపకులతో పాటు తల్లితండ్రుల పాత్ర ఉండాలని, అలా అయితేనే విద్యార్థులు ప్రగతి బాటలో సాగుతారన్నారు. ప్రతీ విద్యార్థి గురించి వారి తల్లితండ్రులతో చర్చించారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకాతను ప్రోత్సహించడమే తమ బాధ్యత అని గుర్తు చేశారు. సమావేశంలో కళాశాల అధ్యాపక బృధంతో పాటు విద్యార్థుల తల్లితండ్రులు ఉన్నారు.

**ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో....**

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశానికి విద్యార్థుల తల్లితండ్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ విద్యార్థుల తల్లితండ్రులు ఇంటి వద్ద వారి పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయని గుర్తుచేశారు. సమావేశం అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తీసుకొచ్చిన తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆట, పాటలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో అధ్యాపక బృధం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్,రవిందర్, సదానందం, నిర్మలాదేవి,లక్ష్మయ్య, ఆస్మా, రాణి,హిమబిందు, గీతాంజలి, రాములుతో పాటు తదితరులు ఉన్నారు.

### దుర్గాదేవి మండపంలో కుంకుమ పూజ

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** పట్టణంలోని పోచమ్మవాడ యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో శుక్రవారం రెండవ వార్డు మాజీ కౌన్సిలర్ బోజు రమాదేవిరవీందర్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించిన వారిలో జాల కాంతవ్వ, సావుల స్వప్న, జాల రాణి, బోజు కనుకవ్వ, చల్ల పద్మ, బోజు సుధారాణి, కేడం సరోజన, బూరుగు రజిత, స్రవంతి, శ్రీలత, శిల్ప, వెంకటలక్ష్మి, చందన, కావ్య, పోచమ్మవాడ యూత్ సభ్యులు ఉన్నారు.


దుర్గాదేవి మండపంలో కుంకుమ పూజ దృశ్యం


సిద్దిపేటలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్


దుద్దెడలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరించిన నాయకులు

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

పౌరుషాన్ని, త్యాగాన్ని, పోరాటాన్ని భావితరాలకు అందించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సుడా పార్క్ సిరిసిల్ల రోడ్డులో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ కె.హైమావతి, మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల రాజనర్సు, జిల్లా బిసి అభివృద్ధి అధికారి సయ్యద్ రఫీ, రజక సంఘాల నాయకులు, కౌన్సిలర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కలెక్టరేట్‌లో బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ పాల్గొన్నారు.

**సిపి కార్యాలయంలో...**

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సిహెచ్.కుశాల్కర్, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మల్లేశంగౌడ్, రామకృష్ణ, విష్ణుప్రసాద్, సుధాకర్, ఫయాజుద్దీన్, వెంకటేశ్వర రావు, అపూర్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చేర్యాలలో...**

**చేర్యాల, సెప్టెంబరు 26,ప్రభాతవార్త**

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ 130వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు శివగారి అంజయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని అంగడి బజార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ మాజీ సభ్యుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య, మాజీ ఎంపిపి మేడిశెట్టి శ్రీధర్, మాజీ వైస్ ఎంపిపి నవీన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మంగోలు చంటి, మంచాల కొండయ్య, రాచకొండ శ్రీను, ఒగ్గు శ్రీశైలం, పచ్చిమడ్ల సిద్ది రాములు, తుమ్మలపల్లి శ్రీను, సాతెల్లి జగన్, సాతెల్లి దేవయ్య, యాట బిక్షపతి, పచ్చిమడ్ల మహేందర్, రాచకొండ కనకయ్య, మంగోలు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

**కొండపాకలో...**

**కొండపాక, సెప్టెంబరు 26, ప్రభాతవార్త**

చాకలి ఐలమ్మ ధైర్య సహసాలను, పోరాటాన్ని సమాజం అదర్శంగా తీసుకొనాలని మాజీ ఎంపిపి ర్యాగల సుగుణ దుర్గయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం దుద్దెడ గ్రామ పంచాయతీ పక్కన ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహన్ని అవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన గొప్ప వ్యక్తి ఐలమ్మ అన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచులు అరెపల్లి మహదేవ్, పెద్దంకుల శ్రీనివాస్, బిజెపి నాయకుడు గడ్డమిది రామస్వామి, నూనె కుమార్, మంచాల శ్రీనివాస్, రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌గణేష్, గొనె శ్రీనివస్, దోమాల ఎల్లం, వడ్లకొండ శ్రీనివాస్, అరెపల్లి శ్రీనివాస్, బుచ్చిగారి మల్లయ్య, వేములు మైసయ్య, రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న నాయకులు


పల్లె చెరువును పరిశీలిస్తున్న గ్రంధాలయ చైర్మెన్ లింగమూర్తి

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి**

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరెపల్లి చౌరస్తాలో వర్షాల కారణంగా ప్రజలు డెంగ్యూ, మలేరియా రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ప్రజలకు ఇందుకు సంబందించిన కరపత్రాన్ని పంపిణీ చేశారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్యతో పాటు మాజీ కౌన్సిలర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

**పల్లె చెరువును పరిశీలించిన గ్రంధాలయ చైర్మన్...**

పట్టణంలోని ఆరెపల్లిలోగల పల్లె చెరువు సుందరీకరణ పనులను శుక్రవారం జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్యతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరీకరణ పనులు బతుకమ్మ పండగ లోపు పూర్తి చేసి పండగకు చెరువును అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తారి రవిందర్, చిత్తారి పద్మ ఉన్నారు.

### ఊరెళ్తున్నారా... జాగ్రత్తలు పాటించండి

**-గజ్వేల్ సిఐ రవికుమార్**

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):** బతుకమ్మ, దసరా పండుగ సెలవులతో అనేక కుటుంబాలు సొంతూరి బాట పడుతుంటాయని, ఇలాంటి తరుణంలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని గజ్వేల్ సిఐ రవికుమార్ సూచించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఇప్పటికే పాఠశాలలకు సెలవులు మొదలయ్యాయని, ఈనెల 28 నుంచి కళాశాలలకు కూడా సెలవులు వస్తుండడంతో ప్రజలు సొంత ఊర్లకు వెళ్ళేందుకు ఏర్పాట్లు చేసుకుంటారని, మళ్ళీ అక్టోబరు 3 తర్వాతే తిరిగి వస్తారని, ఇలాంటి పరిస్థితుల్లో తాళం వేసి ఉండే ఇళ్ళలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఊరికి వెళ్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా ఆ ప్రాంతంలో గస్తీ పెంచుతామని, బంగారు నగలు, నగదును ఇంట్లో పెట్టవద్దని, బ్యాంక్ లాకర్‌లో లేదా నమ్మకం ఉన్న వారి వద్ద పెట్టాలని, వీలైతే వెంట తీసుకెళ్ళాలని సూచించారు. ఇంటి ప్రధాన ద్వారం తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంటికి సెక్యూరిటీ లారం, మోషన్ సెన్సర్, సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సిసి కెమెరాలు అమర్చుకోవాలని, అల్మారా, బీరువా తాళాలను పాదరక్షల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద కాకుండా రహస్య ప్రదేశంలో పెట్టుకోవాలన్నారు. ఊరెళ్ళి తిరిగొచ్చే వరకు రోజు ఇరుగు పొరుగు వారిని అడిగి ఇంటి వివరాలు తెలుసుకోవాలని, అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.


దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు

### దుర్గాదేవికి మాజీ ఎమ్మెల్యే పూజలు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి కొర్విపల్లిలోని ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మెదక్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హనుమంతరావు దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. అంబాజీపేట,మదూర్, చిన్నశంకరంపేటలో మాలాధారభక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఏడుపాయలలో మహాలక్ష్మీ దేవి రూపంలో దర్శనమిచ్చిన దుర్గామాత


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:** ఏడుపాయల వన దుర్గ భవాని మాత దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు అయిన శుక్రవారం స్కందమాత (మహాలక్ష్మీ దేవి) అమ్మవారు రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పండితులు రాజగోపురం తో పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న గోకుల్‌షెడ్‌లో అమ్మవారిని మహాలక్ష్మీ దేవి రూపంలో అలంకరించారు, ఈ సందర్భంగా గణపతి పూజ తో పాటు ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయలకు చేరుకొని ఉత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అమ్మవారి నీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడుపాయలలో ఏలాంటి సంఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.

**తగ్గని మంజీరా ఉధృతి..**

ఏడుపాయలలో కొన్ని రోజులుగా మంజీరా ఉధృతి కొనసాగుతూనే ఉంది, దీంతో అమ్మవారి ఆలయం మూసే ఉంచారు. కాగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే, శుక్రవారం ఘనపూర్ ఆనకట్ట పై నుండి నిజాంసాగర్ వైపు 88వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు పరుగులు తీస్తుంది.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లేశం**

**చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 26,ప్రభాతవార్త:** ప్రభుత్వం కార్మికుల పరిష్కరించాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో పంచాయతీ కార్మికులు,ఆశావర్కర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుతాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో కింది స్థాయి ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉంటుందని తెలిపారు. విరందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి 12 గంటలు పనిచేయాలని నిబందన పెడితే రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలు పనిచేయాలని జులై5న జీవో విడుదల చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కింది స్థాయి ఉద్యోగులైన పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్‌లు, ఐకేపి వీవోఏలు, ఉపాధి ఫిల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత, భీమాను అందించాలని డిమాండ్ చేశారు. సీఐటియూ కార్మికుల పక్షాన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేణుక, నర్సింలు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటియూ నాయకులు

### స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

**ఎంపిడివో వేణుగోపాల్**

**నంగునూర్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడివో వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం నంగునూర్‌లోని రైతువేదికలో ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకంగా మారుతుందన్నారు. అధికారులు ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. వార్డు సభ్యుల పేపర్, సర్పంచ్ పదవికి గులాబీ రంగు బ్యాలెట్ పేపర్, ఎంపిటిసి ఎన్నికకు గులాబీ రంగు, జడ్పీటిసి ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ ఉంటుందన్నారు. ఛాలెంజ్ ఓట్లు,టెండర్ ఓట్లుపై వివరించారు. రాంగోపాల్‌రెడ్డి, బాలరాజు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చేర్యాల, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోలోజు చంద్రం రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు చేతుల మీదుగా అందించారు. మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ములుగు, సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొక్కొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి బస్వాపూర్ పారిశ్రామిక మరియు 11 కెవి సింగన్నగూడ ఏజిఎల్ ఫీడర్లపై ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన ఉప్పరి గంగవ్వ అనారోగ్యం కారణంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల బిఆర్ఎస్ బిసిసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ శుక్రవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేకల కనకయ్య మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపారు. ఆయనతో పాటు మేకల దేవిడ్, ఉప్పరి యాదగిరి, ఉప్పరి కరుణాకర్, ఉప్పరి ఉపేంద్ర, నారని ఎల్లం, కృష్ణ తదితరులు ఉన్నారు.

### రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా గోపి


రేషన్ డీలర్ల సంఘం నూతన అధ్యక్షులు గోపితో డీలర్లు

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** రేషన్ డీలర్‌ల సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా పట్టణ కేంద్రానికి చెందిన మాటూరి గోపి ఎన్నికయ్యారు. శుక్రవారం పట్టణంలో జరిగిన ఈ ఎన్నికలో సంఘం సభ్యులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలో మండల అధ్యక్షునిగా గోపి 12 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి వెంకటరెడ్డి ప్రకటించారు. గోపి ఎన్నిక అనంతరం సంఘం కార్యదర్శిగా గూళ్ల మంగను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం కోశాధికారి కోసం నిర్వహించిన ఎన్నికలో మారుపాక మల్లేష్ 12 ఓట్లతో గెలుపొందినట్లు వారు వివరించారు. నిర్వహించిన ఎన్నికలో గెలుపొందిన నూతన సభ్యులకు సంఘం డీలర్లు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం గోపి మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన**

### న్యాయవాదుల లైసెన్సులు రద్దు చేయాలి


కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై అత్యంత హీనమైన పద జాలంవాడుతూ అనుచిత వ్యాఖ్యలుచేసిన సిద్దిపేట న్యాయవాదులు మురళి మోహన్‌రావు, శ్రీకాంత్‌ల బార్ లైసెన్స్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ బార్ అసోసియేషన్, బిసి, ఎస్సి, ఎస్టి అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి దృశ్యర్యలకు ఎవరూ పాల్పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కొమ్ముల రమేష్, బోయిని సురేష్, రవిందర్, శ్రీనివాస్, శ్రీదేవి, బానోతు శ్రీనివాస్, రాజశేఖర్, జేరిపోతుల కిరణ్, భాస్కర్, పర్శరాములు, ప్రదీప్, సదన్ మహారాజ్, అరుణ్, శ్రీశైలం, ప్రవీణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

### జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 26 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తల్లిదండ్రుల, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ఎలా నడుచుకోవాలి, విద్యార్థినిల భవిష్యత్తుకు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం ప్రథమ సంవత్సరంలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవాలు

**గజ్వేల్, సెప్టెంబర్ 26 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆవరణలో సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 5వ రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కళ్యాణ్‌కార్ దప్మ నర్సింగరావు, జమాల్‌పూర్ దుర్గాబాయి నందలాల్, శ్రీవిద్య ప్రసాద్ దంపతుల నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా భక్తులు అమ్మవారికి వడి బియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సూర్యవంశ ఆరెకటిక సంఘం అధ్యక్షుడు కళ్యాణ్‌కార్ కిషన్, లింగోజీ, జమాల్‌పూర్ విఠల్, నందలాల్, అమర్, లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 26,ప్రభాతవార్త:** మండల పరిధి గవ్వలపల్లి తండాకు చెందిన చందర్ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి రూ.5వేలను పంపగా రాజు బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.అలాగే చిన్నశంకరంపేటలో తుడుం బాలయ్య అనారోగ్యంతో మృతిచెందగా బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు బాధిత కుటుంబానికి 50కేజిల బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, దేవరాజు,నారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాభవానీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న నాయకులు

**నారాయణఖేడ్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని మంగల్‌పేట్‌లోగల దుర్గాభవాని అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం ఆలయం పక్కన భక్తిశ్రద్ధలతో ఎమ్మెల్యే పట్లోళ్ల అనుపమ, సంజీవరెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు సన్మానించి, తీర్థప్రసాదాలను అందించారు. వారితోపాటు మున్సిపల్ మాజీచైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, రమేష్ చౌహాన్ బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కృష్ణమూర్తి, సత్యం, గోవర్ధన్, వీర్‌శెట్టి, శెట్టి శంకర్, పట్టణ ముఖ్య కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పురపాలకసంఘం ఆధ్వర్యంలో
## బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**నారాయణఖేడ్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
బతుకమ్మ పండుగా సందర్భంగా నారాయణఖేడ్ మునిసిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ జె, జగ్జీవన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో నారాయణఖేడ్ గౌరవ శాసనసభ్యులు పట్లోళ్ళ సంజీవరెడ్డి సతీమణి శ్రీమతి అనుపమరెడ్డి, గౌరవ మునిసిపల్ కమిషనర్ జె.జగ్జీవన్, మునిసిపల్ మేనేజర్, మునిసిపల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్, వార్డ్ ఆఫీసర్స్, మెప్మా గిలీది, మహిళా సంఘాల సభ్యులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## కొబ్బరిపీచు పరిశ్రమని సందర్శించిన పటేల్‌గూడ మహిళలు



పరిశ్రమను సందర్శించిన దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడాలో కేంద్ర ప్రభుత్వ సంస్థ క్వాయర్ బోర్డ్ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని శ్రీసత్యనారాయణ కొబ్బరిపీచు పరిశ్రమను సందర్శించారు. ఈ పరిశ్రమ వ్యవస్థాపకులు చెన్నంశెట్టి మోనిక ఉదయ్‌కుమార్ వారికి తాగి పడేసే కొబ్బరి బొండాలతో పీచు, కొబ్బరి పొట్టు తయారీ విధానాన్ని మహిళలకు వివరించారు. కొబ్బరి పీచుతో కొబ్బరి తాడు వివిధ రకాల బొమ్మలు తయారు చేయవచ్చని అదేవిధంగా కొబ్బరి పొట్టుతో డీకంపోస్ట్ చేసి మొక్కలకి ఎరువుగా వాడొచ్చని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో క్వాయర్ బోర్డ్ ప్రోగ్రాం మేనేజర్ ప్రసాద్ ట్రైనర్ మీనా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా ప్రమోద్‌మాదిగ



నియామక పత్రం అందుకుంటున్న ప్రమోద్‌మాదిగ

**రామచంద్రాపురం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరుకు చెందిన వెలిమెల ప్రమోద్‌మాదిగ అందిస్తున్న సేవలను గుర్తిస్తూ శుక్రవారం జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామకపత్రాన్ని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అందచేశారు. తనపై నమ్మకంతో తనకు జిల్లాస్థాయిబాధ్యతలు అప్పగించిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు, అందుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరపు శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్రనాయకులు, జిల్లా ఇంచార్జి రాజుమాదిగ, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఎంఎంఎస్ నాయకులు మైసగల్లా బుచేంద్రమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్ సింధు



బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్ సింధు

**రామచంద్రాపురం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
శ్రీగీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొని అధ్యాపకురాళ్లు, విద్యార్థినులతో కలిసి బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. రంగురంగుపూలతో అందంగాపేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి బతుకమ్మ పాటలను ఆలపిస్తూ జరుపుకున్న వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ సేవలు శ్లాఘనీయమైనవి



నివాళులు అర్పించిన పోలీసులు, గ్రామస్థులు



చాకలి ఐలమ్మ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి



నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నివాళి అర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



చాకలి ఐలమ్మ జయంతి వేడుకల దృశ్యం

**హద్నూర్‌లో...**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని అల్లాదుర్గం-గంగ్వార్ రోడ్డు పక్కలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ దోమ సుచిత్, ఎఎస్ఐ, నాయకులు గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీ సిద్ధివినాయక రజకసంఘం నాయకులు నరేష్, రవీం దర్, సంగన్న, ఈరన్న, రమేష్, నర్సింలు, రాములు, లింగరాజు, పాండు, రాహుల్, రంజిత్, చిన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**డవ్వూరులో...**

**మనూర్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని డవ్వూరులో శుక్రవారం వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో పంచాచయతీ కార్యాలయం వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హనుమారెడ్డి, శివగొండ, అంజుగొండ, నర్సారెడ్డి, మోహన్‌రెడ్డి, సంగప్ప, ఎవన్, రఫీ, అనిల్‌రెడ్డి, యాదన్న, మాణిక్‌పటేల్, ఎం.నర్సింలు, టి. నర్సింహులు, ఎం.రాములు, మొగులాన్‌సాబ్, సిద్దన్న, సంగప్ప, కుమ్మరి దుర్గన్న, గుండయ్యస్వామి, నరసింహారెడ్డి, నాగయ్యస్వామి, సిద్దప్ప, శేఖర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రామచంద్రాపురంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సే అంజిరెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, నాయకులు ఈర్ల రాజు, రజకసంఘం అధ్యక్షులు నర్సింలు, ప్రభు, సాయికిరణ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ జలవిహార్ పార్క్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి కార్పొరేటర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు చాకలి నర్సింహా, ఆత్మ కమిటి డైరెక్టర్ కావలి నగేష్, మాజీ ఎఎంసి డైరెక్టర్ ఐలాపూర్ ఐలేష్, గారెల్ల శ్రీశైలం, నవీన్‌గౌడ్, స్రామాట్, మల్లేష్, హన్మంతు, రమేష్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌లో...**

**నారాయణఖేడ్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:**
చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, తాహెర్‌అలీ మండలకాంగ్రెస్ అధ్యక్షులు, పండరి రెడ్డి, రామకృష్ణ మాజీ ఎంపిటిసిలు, కాలే రాజు, సర్దార్ మాజీ జడ్పిటిసి, బి,రాజి, మారుతి, రజకసంఘంపెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చిట్కుల్‌లో...**

**పటాన్‌చెరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని చిట్కుల్ లోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి నీలం మధు ముదిరాజ్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మహేష్, సత్తయ్య, నర్సింలు, అర్జున్, గోపాల్, కిషోర్, చంద్రశేఖర్, రజకసోదరులు తదితరులు పాల్గొన్నారు. సాకిచెరువుకట్టపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, వెంకటేష్, రజకసంఘం అధ్యక్షుడు మహేష్, పాల్గొన్నారు.

**పుల్‌కల్‌లో...**

**పుల్‌కల్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను రజకసంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.

**చౌటకూరులో...**

మండల కేంద్రమైన చౌటకూరులో రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగమ్మ ఆధ్వర్యంలో చిట్యాల చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రజక సంఘం మాజీ అధ్యక్షులు గొంగ్లూరు నర్సింలు ప్రధాన కార్యదర్శి దత్తు, యువజన సంఘం అధ్యక్షులు ప్రసాద్, నాయకులు నర్సింలు, నాగన్న, మల్లేశం, యాదయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షానికి మునిగిన సిసి రోడ్డు రాకపోకలకు అంతరాయం

-మాజీ కౌన్సిలర్ రంగ సురేష్ చొరవతో తొలగిన ఇబ్బంది



చేనేతసంఘం పక్కన సిసి రోడ్డు నీటిలో మునిగిన దృశ్యం

**జోగిపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు మొత్తం నీటిలో మునిగిపోవటంతో ఆరోడ్డుమీదుగా రాకపోకలు నిలిచిపోయిన పరిస్థితి జోగిపేటలోని 13వ వార్డులో ఏర్పడింది. ఈవార్డులో చేనేతసంఘం పక్కనుంచి ఉన్న సిసి రోడ్డుకు ఇరువైపులా భారీగా పొదలు పెరగటంతో మురికినీరు నిలిచి పూర్తిగా అపరిశుభ్రంగా మారిపోయింది. ఈరోడ్డులోనే ఆకుల శివలింగం ఇంటివద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయి పైనుంచి వస్తున్న నీరు ఎక్కడకు వెళ్లలేని పరిస్థితుల్లో అక్కడే నిలిచి దుర్గంధం పేరుకు పోతుంది. దీనికితోడు గురువారం కురిసిన భారీవర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ ముందు నుంచి సిసి రోడ్డు పూర్తిగా నీటితోనిండిపోయి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో వార్డు మాజీ కౌన్సిలర్ రంగ సురేష్ దృష్టికి తీసుకుపోగా, ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఉదయమే మాట్లాడి జెసిబి తెప్పించి అక్కడ నీరు నిలవకుండా కాలువ తీయించారు. అయితే ఈరోడ్డుకు ఇరుపక్కలా ఉన్న చీదును తొలగించి అక్కడ మురికినీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వార్డుప్రజలు కోరుతున్నారు.

## ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి ప్రమాదం

**జోగిపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి చాలా ప్రమాదకారి అని, సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని ప్రశాంత్ ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌గౌడ్ అన్నారు. అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ ఎ.రవీందర్ ఆదేశాలమేరకు కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాలలో రంగోళి పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఏక్‌దిన్, ఏక్‌సాత్, ఏక్‌గంట అనే కార్యక్రమంపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పి. శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ప్రతిమ, శ్రీకాంత్, కళాశాల విదార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విఠలేశ్వరాలయంలో ఘనంగా చండీహోమం

**జోగిపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలోభాగంగా అందోలులోని శ్రీవిఠలేశ్వరాలయంలో శుక్రవవారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కొడకండ్ల రాధాక్రిష్ణశర్మ పర్యవేక్షణలో ఈయాగం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ హోమంలో మొత్తం తొమ్మిది జంటలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. విఠలేశ్వర ఆలయ భక్తబృందం, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సాయిబాన్‌పేటకు చెందిన బల్వంత్ రెడ్డి, మాజీ సర్పంచు ప్రీతంరెడ్డి, జోగిపేట మాజీ కౌన్సిలర్ డాకూరి శంకర్, అందోలు గ్రామానికి చెందిన యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నీటమునిగిన అల్మాయిపేట-కొన్యాల వంతెన

-బ్రిడ్జి వద్ద పోలీసుల బందోబస్తు



నీటమునిగిన వంతెనను పరిశీలిస్తున్న జోగిపేట ఎస్ఐ పాండు

**జోగిపేట, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సింగూరు ప్రాజెక్టుకు భారీస్థాయిలో వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో శుక్రవారంనాడు పది గేట్లు తెరిచి దిగువకు భారీస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అందోలు మండలం అల్మాయిపేట-కొన్యాల బ్రిడ్జిమీదుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొన్యాల మీదుగా చౌటకూరు, అల్మాయిపేటలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అందోలు పోలీసులు అప్రమత్తమై అల్మాయిపేట శివారులో బ్రిడ్జి మీదుగా ఎవరూ వెళ్లకుండా ముళ్లపొదలను అడ్డుగావేసి, అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లో ఎవరూ బ్రిడ్జి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించకూడదని జోగిపేట ఎస్ఐ పాండు హెచ్చరించారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధపూజ

**చౌటకూరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని శివంపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో (33/11)లో శుక్రవారం ఉద్యోగులు ఆయుధపూజలు నిర్వహించారు. ట్రాన్స్‌కో ఎఈఈ సాయిరాఘవ ముఖ్యఅతిథిగా హాజరై పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ రంజిత్, వంశీచంద్‌రెడ్డి, లైన్‌మెన్‌లు ఈశ్వర్, అనిల్‌కుమార్, రాజేశ్, బీరప్ప తదితరులు ఉన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



బతుకమ్మపండుగ కోసం స్వంతఖర్చుతో చదునుచేయిస్తున్న దృశ్యం

**కొల్చారం, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రాంపూర్‌గ్రామ యువనాయకుడు నెల్లి రాజు అన్నారు. కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బతుకమ్మపండుగను పురస్కరించుకుని మహిళలు బతుకమ్మ ఆడేందుకు స్థలాన్ని తన సొంతనిధులతో చదునుచేయించారు. గ్రామ మహిళలు బతుకమ్మ ఆడేందుకు అనువుగా గ్రామపంచాయతీ, ప్రభుత్వ పాఠశాల వద్ద, స్థలం గుంతలుగామారడంతో అక్కడ మట్టినిపోయించి ట్రాక్టర్ సాయంతో చదునుచేయించారు. గతంలో కూడా గ్రామంలో ప్రధాన రహదారులవెంట, మురికి కాలువల పక్కన పిచ్చిమొక్కలు పెరగడంతో తన సొంతనిధులతో గడ్డిమందు పిచికారి చేయించారు.

## జలమయమైన కాలనీలలో పర్యటించిన ఎమ్మెల్సీ

-స్థానికులకు భరోసాకల్పించిన ఎమ్మెల్సీ



కాలనీవాసులతో కాలనీలలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**పటాన్‌చెరు, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని పలుకాలనీల్లో ఇళ్లు, రోడ్లు జలమయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఇంట్లో నుంచి బయట అడుగుపెట్టలేని పరిస్థితి. కుటుంబసభ్యులంతా ఇంట్లో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలోపెట్టుకొని ఉంటున్నారు. శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి స్థానిక బిజెపి నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో కలిసి ఆయాకాలనీల్లో పర్యటించారు. స్థానికులకు ఎమ్మెల్సీ భరోసాకల్పించారు. అలాగే సంబంధిత మునిపాలిటీ కమిషనర్, ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముత్తంగిలోని దాదాపు 15 కాలనీల్లో కలియతిరుగుతూ స్థానికప్రజల ఇబ్బందులను అడిగి తెలుకున్నారు. ఆయాకాలనీల వరదముంపు సమస్యకు పర్మినెంట్ పరిష్కారం చూపి, భవిష్యత్తుల్లో ఇలాంటి ఇబ్బంది కాకుండాచూడాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారులకు సూచించారు.

## ఎల్‌ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, సెప్టెంబరు 6, ప్రభాతవార్త:**
నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయినిగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బిహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న షేక్ ఇబ్రహీం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ప్రభుత్వం మంజూరుచేసిన రెండులక్షల 50వేల రూపాయల ఎల్‌ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో షేక్ ఇబ్రహీం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతులమీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జడ్పిటిసి గంగుల సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, శ్రీధర్‌చారి, చంద్రశేఖర్, రామిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

# భారీవర్షాలతో కోతకు గురవుతున్న రోడ్డు

-మనూర్‌కు పోయేందుకు 10గ్రామాల వారికి ప్రయాస
-మరమ్మతులు చేయాలని ప్రజల వేడుకోలు



మనూర్‌లో కోతకు గురవుతున్న రోడ్డు దృశ్యం

**మనూర్, సెప్టెంబరు 26, ప్రభాతవార్త:**
గత కొన్నిరోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లపరిస్థితి అధోగతిగా మారుతోంది. రోడ్డు కుంగిపోతుండటంతో మండల కేంద్రమైన మనూర్‌కు వచ్చేందుకు 10గ్రామాల ప్రజలు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి, ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... భారీగా కురుస్తున్న వర్షాలతో మనూర్ గ్రామ శివారులోని వాగువద్ద రోడ్డు అటుగా ప్రయాణించే ఆస్కారం లేకుండా పోతోంది. ఈ రోడ్డు గుండానే మండల కేంద్రమైన మనూర్‌కు మండల పరిధిలోని మాయికోడ్, రాణాపూర్, తుమ్నూర్, ముగ్దంపూర్, బోరంచ, దుదగొండ, లింగంపల్లి, ఉసిరికెపల్లి, ధన్వార్, రాయిపల్లి గ్రామాల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. గతంలో రోడ్డు పనులు చేస్తున్న తరుణంలో బావిపక్కన రెయిలింగ్‌ను నిర్మించారు. ఇటీవల కురుస్తున్నవర్షాలతో బావిచుట్టూ నిర్మించిన రెయిలింగ్ దెబ్బతినడంతో రోడ్డు బావివైపుకు వంగిపోయిందని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రెయిలింగ్ తెగిపోతుండటం, ఇటువైపు నిండుకున్న బావి, అటువైపు పొంగుతున్న వాగులతో అటుగా ప్రయాణించేందుకు ప్రజలు సర్కస్ ఫీట్లు చేయాల్సివస్తోంది. ప్రమాదకరంగా మారిన రోడ్డుకు అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతు పనులు చేయించాలని ఆయాగ్రామాల ప్రజలు వినతి చేస్తున్నారు.